సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

# ఆదివారం

14.4.2024




# చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన రాళ్ల దాడి ఘటన రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఇది ఏ పరిస్థితికి కారణమవుతుందో? సార్**

**– వి. విజయకుమార్, విజయవాడ**

మీరన్నది నిజమే.... విజయ్ గారు.... ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఆధారాలను సేకరించేందుకు క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. అజిత్ సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ దగ్గర ఈ దాడి జరగడంతో స్కూల్ బిల్డింగ్ పైనుంచి రాళ్లు రువ్వినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆ ప్రాంతంలో అమర్చిన సీసీటీవీ ఫుటేజ్‌లను తనిఖీ చేస్తున్నారు. డ్రోన్ల ద్వారా దాడి జరిగిన ప్రదేశాన్ని ఏరియల్ సర్వే నిర్వహించారు. దీని ద్వారా ఆధారాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. వివేకానంద స్కూల్‌కు, గంగానమ్మ గుడికి మధ్య ఉన్న చెట్ల ప్రాంతం నుంచి దాడి చేసి జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కుడివైపున నివాసాలు ఉండటంతో ఎడమవైపున స్కూల్, గంగానమ్మ గుడి మధ్య ప్రాంతాన్ని ఎంచుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. రాత్రి వేళ కావడంతో నిందితుడు ఎవరికీ కనిపించకుండా.. 30 అడుగుల దూరం నుంచి దాడి చేసి ఉంటాడని అంచనా వేస్తున్నారు. మరోవైపు పలువురు అనుమానితులను పోలీసులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో వేలిముద్రలను కూడా సేకరించినట్టు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అజిత్ సింగనగర్ పోలీసులకు వైద్య నివేదిక అందింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే వెల్లంపల్లి నుంచి స్టేట్‌మెంట్ తీసుకోనున్నారు పోలీసులు. దీని ఆధారంగా కేసు నమోదుచేయనున్నారు.

కాగా, ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు సీఎం జగన్ శనివారం రాత్రి హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కంటిపై గాయానికి రెండు కుట్లు వేసిన వైద్యులు.. రెండు రోజుల విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాడి సమయానికి ఆ ప్రాంతంలో విద్యుత్తు సరఫరా లేకపోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. దాడి సమయంలో సీఎం పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌కూ రాయి తగిలి గాయమైంది.

**కూరల్లోకెల్లా వంకాయకూర రాజు అన్నది ఎలా నానుడో.. ఎన్ని బిర్యానీలున్నా.. అన్నింటిలోకెల్లా హైదరాబాద్ బిర్యానీ స్పెషల్. ముఖ్యంగా హైదరాబాద్ చికెన్ దమ్ బిర్యానీ పేరు చెప్పీ చెప్పగానే ఎవరికైనా నోరూరుతుంది. ఇతర రాష్ట్రాల నుంచే కాదు.. దేశ, విదేశాల నుంచి నగరానికి వచ్చినవారు కూడా ఇక్కడి బిర్యానీ టేస్ట్ చేయనిదే తిరిగి వెళ్లరంటే అతిశయోక్తి కాదు మరి. ఇది మన హైదరాబాద్‌కి కీర్తి తెచ్చేదే ... మీరేమంటారు.**

**–బండారు విజయలక్ష్మి, హైదరాబాద్**


అవును విజయలక్ష్మిగారూ అసలు సిసలు హైదరాబాద్ బిర్యానీ తిన్నవారెవరైనా.. ఆ రుచి మరచిపోలేరు. నగరానికి వచ్చినపుడు తినకుండా వెళ్లలేరు. అదీ.. హైదరాబాద్ బిర్యానీ ప్రత్యేకత. అందుకే ఎప్పుడూ టాప్ లో ఉంటుంది.

రంజాన్ నెలలో.. నగరవాసులు ఎక్కువగా తిన్న ఫుడ్ ఏంటి అని సెర్చ్ చేస్తే.. బిర్యానీనే అని తేలిందట. ఈ నెలరోజుల వ్యవధిలో ఏకంగా 10 లక్షల పేట్ల బిర్యానీ ఆర్డర్లు వచ్చాయని ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తెలిపింది. మార్చి 11 నుంచి ఏప్రిల్ 8 వరకూ వచ్చిన ఆర్డర్ల వివరాలను వెల్లడించిన స్విగ్గీ.. నెలరోజుల్లో ఏకంగా 60 లక్షల ప్లేట్ల బిర్యానీలను డెలివరీ చేసినట్లు చెప్పింది. సాధారణంగా జరిగే బిర్యానీ డెలివరీలతో పోల్చితే.. ఇది 15 శాతం అధికం. వీటిలో ఒక్క హైదరాబాద్ లోనే 10 లక్షల పేట్ల బిర్యానీలను డెలివరీ చేసినట్లు పేర్కొంది.

బిర్యానీతో పాటు హలీమ్ డెలివరీల్లోనూ నగరవాసులు రికార్డు సృష్టించినట్లు చెప్పింది స్విగ్గీ. నెలరోజుల్లో ఏకంగా 5.3 లక్షల హలీమ్ లు ఆర్డర్లు వచ్చినట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇఫ్తార్ విందు జరిగే సమయంలో సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల్లో 34 శాతం ఆర్డర్లు పెరిగినట్లు వివరించింది. ఇలా దేశంలోనే స్విగ్గీ అత్యధిక బిర్యానీలు, హలీమ్ లను డెలివరీ చేసిందన్నమాట. ఒక్క స్విగ్గీలోనే ఇన్ని డెలివరీలు ఉంటే.. ఇక జొమాటో ఇతరత్రా ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్ ల ద్వారా ఇంకెన్ని లక్షల బిర్యానీలు లాగించేసి ఉంటారో కదూ.

# సిద్ధి పొందిన తాపసి రమణ మహర్షి

లెజెండ్



ఆది 1879వ సంవత్సరం డిసెంబర్ 29వ తేదీ. దక్షిణ భారతావని లోని తమిళనాట తిరుచ్చులీ క్షేత్రం. శివుని పంచమూర్తులలో నటరాజ ఆనందమూర్తి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని, జరుపుకున్న ఆరుద్ర దర్శనం' అనే ఉత్సవ సందర్భం. శ్రీభూమినాథేశ్వర ఆలయ సంబంధ ఆలంకృత ఉత్సవ మూర్తులను రథంపై వీధుల గుండా ఊరేగించిన ఉత్సవ సమయం. కొనసాగుతున్న ఉత్సవ క్రమంలో ఆర్ధరాత్రి దాటాక డిసెంబర్ 30నాటి తొలి గంటలో కోవెలను ఆనుకుని ఉన్న ఇంటిలో ఒక మగ శిశువు జన్మించాడు. సుందరం అయ్యర్, ఆళగమ్మ దంపతులకు కలిగిన ఆ బాలునికి .. "వేంకటేశ్వరన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే తర్వాతి కాలాన "భగవాన్ రమణ మహర్షి" అని ఖ్యాతి గడించాడు. బాలుని బాల్యం సాధారణంగా సాగింది. తండ్రి మందలింపు తో ఒకమారు పక్క గుడిలో జగన్మాత విగ్రహం వెనుక దాగి ఉన్నాడు. తెలియని వయసులో ప్రాపంచిక సంకటాల నుండి ఉపశమన లక్ష్యంతో దైవసన్నిధిని ఆశ్రయించడం భవిష్యత్ జీవితానికి సంకేతం. అద్భుత జ్ఞాపక శక్తి కారణంగా పాఠశాలలో విన్నవన్ని వెంటనే అప్పచెప్పేవాడు. యువకునిగా పెరియ పురాణం (శివభక్త విలాసం) గ్రంథాన్ని పఠించారు. శివునికి ధన ప్రాణమానాలను సమర్పించిన 63 నాయనార్ల గాథల పట్ల దివ్యావేశానికి లోనై, త్యాగభరితమై సాయుజ్యానికి దారితీసే గాథలకు పరవశుడై, సాధుమార్గ అన్వేశి అయినారు.

నాటినుండి ఆయనలో దివ్య ప్రేరణ కలిగింది. రామస్వామి అనే వ్యక్తిని ఎక్కడనుండి వస్తున్నారని ప్రశ్నించి ," ఆరుణా చలం" , నుండి అని సమాధానం పొందగా, ఆయన ఎదో తెలియని అనుభూతికి లోనైనారు. నాటి నుండి ప్రాపంచిక విషయాల పట్ల విముఖులు కావడం ప్రారంభమైంది. 1896 ఆగస్టు 29న చదువుల పట్ల నిరాసక్తత కలిగి, ఇల్లు వదిలి స్కూల్ ఫీజు కు 5రూపాయలు అన్న వద్ద తీసుకుని, ఉదాత్తమైన ఆశయ సాధనకోసం వెళుతున్నానని 3 రూపాయలు మాత్రమే వెంట ఉంచుకుని, లేఖ వదిలి వెళ్ళి, దైవ మార్గ నిర్దేశత్వంతో, కష్ట నష్టాలకులకు ఓర్చి, సుదీర్ఘ ప్రయాణానంతరం సెప్టెంబర్ 1న ఆరుణోదయ వేళలో . . . ఆరుణాచలంలో మంగళ ప్రద మంగళవారం మంచి ఘడియలో పాదం మోపి, ప్రాకార ద్వారాలు, గర్భాలయం సహా బార్ల తెరిచి ఉన్న శ్రీఆరుణాచలేశ్వర ఆలయ ప్రవేశం చేశారు. మహాలింగాలింగనం ద్వారా ఆత్మ సమర్పణం చేసుకున్నారు. నాటి అరుణాచల ఆగమనం నుండి నేటి రమణాశ్రమంగా రూపు దిద్దుకున్న గిరి దక్షిణ పాదంలో స్థిరపడి, 1950 , ఎప్రిల్ 14 మహా నిర్యాణం వరకు 54 ఏళ్ళు, బ్రాహ్మణ స్వామిగా చిరపరిచితులై, తమకు ప్రియమైన అరుణగిరి పొలిమేర దాటనే లేదు. స్వామి ఉనికిని గురించి తెలుసుకున్న తల్లి అళగమ్మ, ఇంటికి వెళదామని అర్థించ గా,.. "కర్త వారివారి ప్రారబ్ధానుసారం జీవులనా డించును. జరుగనిది ఎంత ప్రయత్నించినను జరుగదు. జరుగునది ఎవరెంత యడ్డు కున్నను జరుగనే జరుగును. ఇది సత్యము. కనుక మౌనముగ ఉండుటయే ఉత్తమము"... అని కాగితంపై రాయగా , ఆమె ఖిన్నవదనయై వెనుతిరుగారు. రమణులు గిరిపై విరూపాక్ష గుహలోనే 17 ఏళ్ళ వాసాన్ని గడిపారు. 1916లో రమణు లు విరూపాక్ష నుండి స్కందాశ్రమానికి మారారు. తల్లి అక్కడున్న అందరికీ వండి పెట్టగా , ఆమెకు అనుక్షణం వైరాగ్యాన్ని బోధించారు. 1920లో తల్లి ఆరోగ్యం క్షీణించగా , ఆమను కంటికి రెప్పలా కాపాడుతూ, 22లో రమణుల హస్త మస్తక సంయోగ దీక్ష ద్వారా అళగమ్మకు దేహ విముక్తి కలిగించారు . ఆమెకు స్పృహ ఉన్నంత వరకు వేదాంత బోధ చేస్తూ, చివరగా తమ కుడి చేతిని ఆమె హృదయం పైన, ఎడమ చేతిని శిరస్సుపైన ఉంచి, తదేక దృష్టితో వీక్షిస్తూ, మోక్షాన్ని ప్రసాదించారు . ఆమె పార్థివ శరీరాన్ని దహనం చేయకుండా, గిరి దక్షిణ పాదంలో సమాధి చేశారు . ఆ సమాధి చుట్టూ నిర్మాణాల సమాహారమే నేటి శ్రీరమణాశ్రమం. 1949లో మహర్షుల ఎడమ మోచేతిపై సార్కమా ( క్యాన్సర్) రాగా 1950, ఏప్రిల్ 14 న స్వామి అంతిమ ఘడియలు సమీపించాయని గ్రహించిన భకులు "ఆరుణాచల శివ" అంటూ రమణ మహర్షి విరచితాలను నినదించగా, రా త్రి 8 .47 గంటల సమయాన దక్షిణాకాశంలో ఒకపెద్ద కాంతి గోళం మెరసి, ఈశాన్యం వైపు పయనించి, ఆరుణాచల శిఖరాన అంతర్హితమైంది. రమణుల ఆధ్యాత్మిక శక్తి వికాసం ఆయన దేహయాత్ర అనంతరం నానాటికీ మహోజ్వలంగా బాసిస్తునే ఉన్నది .

**రామకిష్టయ్య సంగనభట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

### నా బాల్యాన్ని నాకెవరైనా ఇస్తారా?



బాల్యమంటే విరిజాజుల పూతోట
బాల్యమంటే ఆనందాల హరివిల్లు
అమ్మే తొలి దైవం
నాన్నే తొలి గురువు
అమ్మ వాక్కు వేద వాక్కు
నాన్న వాక్కు బ్రహ్మ వాక్కు
బాల్యంలో ఆడుకొన్న అటలు
మరచి పోలేని తీపి గురుతులు
మట్టి చేతులతో పచ్చి చింత
కాయలను తెంపి
పచ్చి మిరప ఉప్పు కలిపి
బండ మీద పచ్చడి చేసుకొని తిన్న
ఆ దృశ్యం
ఇంకా కళ్ళల్లో మెదులు తూనే ఉంది
మామిడి తోపుల్లో దొంగ చాటుగా
మామిడి కాయలు తెంపుకొని
పొట్లంలో దాచుకొన్న ఉప్పూ
కారంతో
అద్దుకొని తిన్న ఆ దృశ్యం ఇంకా
కళ్ళముందు కదలాడుతూ ఉంది.
జీరంగుల్ని పట్టుకొని
దారం కట్టి అగ్గిపెట్టెలో దాచి
చింత చిగురు తినిపించి
రెక్కల శబ్ధంవింటూ గాలిలో వదిలి
ఆ దృశ్యాన్ని తలచుకొంటే ఏదో
తెలియని ఆనందం
ఇసుక గూళ్ళు కట్టుకొని
మా బాహుదా ఏరులో జలకాలాడిన
బాల్యం
మునగ చెట్టు బెండ్లు కట్టుకొని
పూరవతల దిగుడు బావుల్లో
ఈత కొట్టిన బాల్యం
బుడ్డి లాంతరు వెలుగులో
పుస్తకాలతో కుస్తీ పడుతున్నప్పుడు
మసి బారిన ముక్కును, ముహాన్ని
చూసి
స్నేహితులంతా నవ్వుకొన్న బాల్యం
చిన్న చెట్లను నాటి ఈతాకులు కప్పి
పందిరి వేసి ఆకుల తోరణాలు
కట్టి
సీతా రాముల పెళ్ళిలో
పురోహితుల వేషం కట్టిన బాల్యం
నా బాల్యం మళ్ళీ నాకు కావాలి
నా బాల్యాన్ని నాకెవరైనా తెచ్చి
ఇస్తారా?


**వారణాసి భానుమూర్తి రావు**
**9989073105**

## లేఖలు

**ముఖచిత్ర కధనం బాగుంది**

సైన్స్ మేధో సంపత్తి పెరగని రోజులలోనే సిద్ధులు శాస్త్రాల ఆధారంగా అనేక ఖగోళ పరిశ్రమలతో పాటు ప్రపంచ యాత్రలు కూడా నిర్వహించారు. అలాంటి వారిలో భూమి- ప్రపంచ పటం మానవాళికి పరిచయం చేసిన వారి గురించి ప్రత్యేక కథనం ప్రచురించిన మీకు ధన్యవాదాలు. మాకు ఇంతవరకు తెలియని ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ వివరణాత్మకంగా రచించిన సీనియర్ జర్నలిస్టు వివి రావుగారికి ధన్యవాదాలు. ప్రత్యేక వ్యాసం ప్రచురించిన సంపాదక వర్గానికి, సూర్య యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**




**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## రాయలేని రాతల్లో..




తరతరాలుగా
మనుషులంతా ఒక్కటేనని
మానవతే
విశ్వగమనపు ఫిజిక్స్ నియమమని
గళమెత్తిన
మన మాతృభూమి లోనే..
మతాల పేరిట
మారణహోమాలు సృష్టిస్తుంటే..!
మాతృ దేవో భవ నినాదాన్ని
మన ఔన్నత్యంగా గుర్తించి,కీర్తిస్తున్న
ఈ ఆన్లైన్ తరంగపు తరుణంలో..
ఆడపిల్లలను అనాగరికంగా
అగ్ని కి ఆహుతి చేస్తుంటే..!
మానవ సేవే మాధవ సేవ అని
రాస్తూనే
నడిరోడ్డుపై ప్రాణాలు పరలోకానికి
పోతుంటే ప్రక్కన నిలబడి సెల్ఫీలు
దిగుతుంటే..!
రాయలేని రాతల్లో..
నిద్రలేని రాత్రుల్లో..
నా అక్షరం ఆవేశంతో
రుద్రకాళిలా మారి
మానవత్వం మరుగున
పడిపోయిందని..!
మనిషితనం సజీవ
సమాధయ్యిందని..!
మహాత్మా గాంధీజీ తో
మాట్లాడుతుంది!
మౌనముద్రలోని ఆయనను గట్టిగానే
ప్రశ్నిస్తుంది!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**









# సూర్య బుడత

బాలల కథ

## కోతిపిల్ల - మొసలి

దిలో మొసలికి చెట్టుపైనున్న కోతి పిల్లను తినాలన్న కోరిక కలిగింది .కోతిపిల్ల తల్లి లేని సమయం చూసి మెల్లగా కోతి పిల్లతో మాటలు కలిపింది. "నదికి అటువైపు పళ్ళ తోటలున్నాయి, నా వీపు మీద కూర్చొంటే నిన్ను అక్కడకు తీసుకెళ్తాను " అంటూ చెప్పింది. అమాయకపు కోతి సంతోషంతో మొసలి పైన కూర్చొంది.

నది మధ్యలోకి వెళ్ళాక " అటువైపు పళ్ళ తోటలేదు. నిన్ను తినడానికే అబద్దం చెప్పి తీసుకొని వచ్చాను " అంది

" నేను ఎలాగూ చనిపోతాను. చివరన ఒక మంచి పని అయినా చేస్తాను నా దగ్గర ఒక వింత వస్తువు వుంది చూడు " అంటూ తనదగ్గరున్న సెల్ ఫోన్ ఆన్ చేసి వీడియో గేమ్స్ పెట్టి మొసలి కళ్ళకు కనపడేలా పట్టుకొంది అమాయకపు కోతి.

మొసలి వీడియో గేమ్స్ చూస్తూ అన్నింటినీ మరచి సీరియస్ గా చూడసాగింది . కోతికి చేయి నొప్పి రావడంతో పొరపాటున జారవిడిచింది . ఫోన్ నదినీటిలో మునిగిపోయింది

"సారీ , మొసలీ అది నీళ్లలో పడితే పనిచేయదు .నా దగ్గర ఇంకొక సెల్ ఫోన్ చెట్టుమీదుంది " "అంది

"వెంటనే తెచ్చివ్వు" అంటూ వెనక్కి తిరిగి కోతిని ఎక్కించుకున్న చోటుకు వేగంగా వచ్చింది.

అమాయకపు కోతి రావడం చూసి "ఎక్కడకు వెళ్ళావు"అడిగింది తల్లి కోతి

తల్లి దగ్గర జరిగిందంతా చెప్పి " సెల్ ఫోన్ తీసుకొని మొసలికి




ఇవ్వడానికి వచ్చాను "


" అయ్యో, ప్రియమైన అమాయకపు కోతీ.నీ అమాయకత్వం అలుసుగా తీసుకొని నిన్ను చంపాలనుకొంది. నేటి మానవుల పిల్లల భవిష్యత్తును ,ఆలోచనలను , ఆరోగ్యమును పాడు చేస్తున్న ఈ సెల్ ఫోన్ నాకు దొరికితే వద్దనుకొంటూనే తీసుకొని వచ్చాను. అదృష్టవశాత్తు నీకు తెలీకుండానే ఆ సెల్ ఫోన్ వలన ఆ మొసలి మెదడును మొద్దుబారేలా చేసింది . సెల్ ఫోన్ మీద ఆశతో నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చింది "అంటూ సెల్ ఫోన్ ఎంతటి ప్రమాదకరమైనదో వివరించింది తల్లి కోతి.


" సెల్ ఫోన్ నన్ను కాపాడినా, చాలా ప్రమాదకరమైనదని తెలుసుకున్నాను ",అంటూ ఆ సెల్ ఫోన్ తీసుకొని నది నీటిలో విసిరివేసింది అమాయకపు కోతి

**(అయిపోయింది)**


**ఓట్ర ప్రకాష్ రావు**
**09787446026**






| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 3 | | | 7 | | | | |
| 6 | | | 1 | 9 | 5 | | | |
| | 9 | 8 | | | | | 6 | |
| 8 | | | | 6 | | | | 3 |
| | | | 8 | | 3 | | | 1 |
| 7 | | | | 2 | | | | 6 |
| | 6 | | | | | 2 | 8 | |
| | | | 4 | 1 | 9 | | | 5 |
| | | | | 8 | | | 7 | 9 |




**మంచిమాట**

తమ తప్పులు
కప్పిపుచ్చుకునేవారు
ఇతరుల తప్పులను
అన్వేషిస్తారు

# మైలురాళ్లు, అభివృద్ధి వేడుకలు



డాక్టర్ సి. జ్యోతి బుడి,
మెడికల్ డైరెక్టర్,
ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్

గత దశాబ్ద కాలంలో, సహాయక పునరుత్పత్తి సాంకేతికత రంగం ప్రత్యేకమైన పరిణామ క్రమాన్ని చూసింది. సాంకేతిక పురోగతికి స్థిరమైన నిబద్ధత, సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్న దంపతులకు సమగ్ర సంరక్షణను అందించడంలో నైపుణ్యం కీలకంగా నిలిచింది. వ్యక్తులు మరియు జంటలు తమ ప్రతిష్టాత్మకమైన పేరెంట్‌హుడ్ కలను సాకారం చేసుకోవడంలో సహాయపడాలన్న తిరుగులేని లక్ష్యంతో ఈ అంకితభావం ప్రేరణను అందుకుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిర్భావం అత్యంత ముఖ్యమైన మార్పులలో ఒకటి కాగా, ఇది పునరుత్పత్తి ఔషధం డొమైన్‌ను విప్లవాత్మకంగా మార్చింది. సంతానోత్పత్తి చికిత్సల ఖచ్చితత్వం, సామర్థ్యాన్ని పెంచచేందుకు అపూర్వమైన అవకాశాలను అందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గారిథమ్‌లు, వైద్య చరిత్ర, జన్యు సమాచారం, చికిత్స ఫలితాలతో సహా రోగి డేటాను సమగ్రంగా విశ్లేషించేందుకు వాటి అసమాన శక్తితో వ్యక్తిగతీకరించిన ఇన్‌సైట్లు, అంచనా విశ్లేషణలను అందిస్తాయి. ఇది ప్రతి రోగి ప్రత్యేక లక్షణాలకు అనుగుణంగా చికిత్స ప్రోటోకాల్‌లను రూపొందించేందుకు, విజయవంతమైన గర్భధారణ అవకాశాలను ఆప్టిమైజ్ చేయడానికి సంతానోత్పత్తి నిపుణులను అవకాశం కల్పిస్తుంది.

అంతేకాకుండా, ఏఐ- పవర్డ్ ఇమేజ్ ఎగ్జామినేషన్ టెక్నిక్‌లు ఐవీఎఫ్ (%×ఎఖీ%) ప్రక్రియలో పిండం ఎంపికను పునరుద్ధరిస్తున్నాయి. పిండం పరిస్థితి అంచనా సాంప్రదాయ పద్ధతులు సబ్జెక్టివ్ విజువల్ ఇన్‌స్పెక్షన్‌పై ఆధారపడి ఉంటాయి. ఇది అసమానతలకు దారితీసేందుకు అవకాశం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ వ్యవస్థలు అసాధారణమైన ఖచ్చితత్వంతో పిండాల నిర్మాణ లక్షణాలను అధ్యయనం చేస్తాయి. విజయవంతమైన ఇంప్లాంటేషన్ కోసం అత్యధిక సామర్థ్యాన్ని కలిగి ఉన్న వాటిని గుర్తిస్తాయి. ఇది పిండం ఎంపిక ప్రక్రియను క్రమబద్ధీకరించడమే కాకుండా మొత్తం ఐవీఎఫ్ విజయవంతమయ్యే శాతాన్ని కూడా పెంచుతుంది. పలు సంవత్సరాలుగా, విజయాల రేటు 60% నుంచి 70% మధ్యకు వృద్ధి చెందింది.

అలాగే, ఏఐ ప్రాముఖ్యత అనేక ఇతర ఆవిష్కరణల ద్వారా సాధించిన అద్భుతమైన పురోగతిని పూర్తి చేసింది. ఉదాహరణకు, ఆర్ఐ విట్నెస్ సిస్టమ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సాంకేతికతను ప్రతి గేమేట్‌కు రోగి గుర్తింపును సురక్షితంగా లింక్ చేసేందుకు వినియోగించుకుని, ఐవీఎఫ్ ప్రక్రియలో గేమేట్ అసమతుల్యత అవకాశాన్ని తొలగిస్తుంది. ఇది రోగులకు, ఆరోగ్య సంరక్షణను అందించే సిబ్బందికి అత్యున్నత స్థాయి విశ్వసనీయతను, మనశ్శాంతిని అందిస్తుంది. సహాయక పునరుత్పత్తి సాంకేతికతలతో సంబంధం ఉన్న అత్యంత ముఖ్యమైన ముప్పులలో ఒకదాన్ని తగ్గిస్తుంది.

అదనంగా, కె-సిస్టమ్ ఇంక్యుబేటర్లు అందుబాటులోకి రావడంతో పిండం పెరుగుదల కోసం పరిసర ప్రాంతాలను సంస్కరించింది. ఈ అత్యాధునిక ఇంక్యుబేటర్‌లు సరైన, స్థిరమైన వాతావరణాన్ని అందిస్తాయి. ఆరోగ్యకరమైన పిండాల అభివృద్ధికి తోడ్పడేందుకు మానవ శరీరం పరిస్థితులను అనుకరిస్తాయి. ఖచ్చితమైన ఉష్ణోగ్రత, తేమ, వాయువు సాంద్రత స్థాయిలను నిర్వహించడం ద్వారా, ఈ ఇంక్యుబేటర్లు పిండం సాధ్యతను మెరుగుపరచి, విజయవంతమైన ఇంప్లాంటేషన్ అవకాశాలను పెంచి, సామూహిక విజయవంతం అయ్యే నిష్పత్తిని మెరుగుపరుస్తాయి.

ఇంకా, %శ×ూ=×శ% అలారం వ్యవస్థ జారీతో ప్రయోగశాల వాతావరణంలో క్లిష్టమైన డిపెండెన్సీలను పర్యవేక్షించడంలో, నియంత్రించడంలో కీలకంగా ఉంది. ఈ అధునాతన వ్యవస్థ పరికరాల సరైన పనితీరును నిర్ధారిస్తూ, సంతానోత్పత్తి చికిత్సల సమగ్రతను రాజీ చేసే సామర్థ్యాలను నియంత్రించే అంతరాయాలకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తుంది. ఏవైనా సమస్యలను ముందస్తుగా గుర్తించి, పరిష్కరించడం ద్వారా, క్లినిక్‌లు ఐవిఎఫ్ ప్రక్రియ వ్యాప్తంగా నాణ్యత, వాగ్దానానికి సంబంధించిన అత్యధిక ప్రమాణాలను నిర్వహిస్తాయి.

అయినప్పటికీ, సంతానోత్పత్తి పరిశ్రమ పరిణామ ప్రయాణం సాంకేతిక పురోగతికి మించి విస్తరించింది. ఇది రోగి సంరక్షణకు సమగ్రమైన విధానం ద్వారా వర్గీకరించబడుతుంది. వారి సంతానోత్పత్తి ప్రయాణంలో రోగుల మానసిక, భావోద్వేగ శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడంపై స్థిరమైన దృష్టిని ఉంచుతుంది. నేడు, అనుభవజ్ఞులైన కౌన్సెలర్ల బృందాలు సంతానలేమి చికిత్సకు సంబంధించిన సవాళ్లు, అనిశ్చితులను నావిగేట్ చేయడంలో కీలకమైన మద్దతును అందిస్తాయి. ఈ సమీకృత విధానం సంతానలేమికి సంబంధించిన మానసిక అంశాలను పరిష్కరించే ప్రాముఖ్యతను గుర్తిస్తుంది. వ్యక్తుల పూర్తి శ్రేయస్సుపై దాని తీవ్ర ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది.




మేము పలు సంవత్సరాలుగా, సహాయక పునరుత్పత్తి సాంకేతికత పరివర్తన ల్యాండ్‌స్కేప్‌ను ప్రతిబింబిస్తున్నప్పుడు, రేపటి కోసం అవకాశాల ప్రపంచాన్ని తెరిచిన మైలురాళ్లను గుర్తించడం చాలా కీలకం. ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (%×జూ×%) నుంచి క్రియోప్రెజర్వేషన్ పద్ధతులు మరియు స్టెమ్ సెల్ చికిత్సల వరకు, సంతానోత్పత్తి సంరక్షణ కోసం ఎంపికలు విస్తరించాయి. బ్లాస్టోసిస్ట్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ మరియు అసిస్టెడ్ హాట్చింగ్ టెక్నిక్స్ వైఫల్యం బహుళ చక్రాల నేపథ్యంలో ఇంప్లాంటేషన్ రేట్లను మెరుగుపరిచాయి. సహాయక పునరుత్పత్తి ఔషధాన్ని అభివృద్ధి చేయడంలో ఒక దశాబ్దపు శ్రేష్ఠతను సూచిస్తూ, ఫెర్టీ9 ఈ రూపాంతర మార్పులలో ముందంజలో ఉంది. మరింత అవలోకిస్తే, నిరంతర ఆవిష్కరణ, రోగి-కేంద్రీకృత సంరక్షణ పట్ల దృఢమైన భక్తి నిస్సందేహంగా సంతానోత్పత్తి ఔషధం భవిష్యత్తును మరింత ఎత్తుకు నడిపిస్తూ, విశ్వాసం మరియు ఆశతో ఈ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ప్రజలను శక్తివంతం చేస్తుంది.

# జవాబుదారీతనాలు లేని ప్రశ్నలన్నీ జతకడితే సమాధానం

ప్రశ్నల లోపమో లేక ప్రశ్నలే మంచివే కావో, ప్రశ్నించే వాళ్ళే మనకు ప్రశ్నార్థకమో! తెలియదు కానీ కాలరు పట్టుకుని అడిగిన వాళ్ళంతా కటకటాల పాలవుతున్నారు రాష్ట్రీయం, జాతీయం, అంతర్జాతీయం అనే తేడా లేకుండా! ఓటర్లంతా నిక్కచిగా నిలదీసి అడగలేకపోతున్నారు నాయకులను. ఏది అభివృది? ఎవరు మంచి, ఎవరు చెడు? ఏది రాజధాని? ఎక్కడ నిధులు? మద్యం నిషేధమా? లేక బ్రాండ్ల సమస్యా? నిన్నటివరకు ఈ పార్టీలో రేపు మరోపార్టీలో? పరీక్ష రాసే విద్యార్థి మదిలోని అర్థంకాని చిక్కు ప్రశ్నల్లా! కానీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఆ భయం లేదు, అభయమూ లేదు! ఇప్పుడు ఓటర్లు దైవస్వరూపాలు, దైవమే మనలో ప్రవేశించి సమాధానపరుస్తుంది. అడిగే నాయకులే అడ్డగోలు అన్నట్లుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు మ్యానిఫెస్టోలను ఈస్టమన్ కలర్‌లో చూపించి, వెంటనే తూచ్ అంటూ మడిచి మనజేబులోనే పెట్టి ప్రజలకు దూరంగా జరిగి, తర్వాత ప్రతిపక్షంలోకి వచ్చి అధికారానికి దూరమైతే నిరంతరం చేతిలో మైకుతో, రాత్రి పగలు తేడా లేకుండా అర్థమే కాని హామీలతో, కొత్త నినాదాలతో ఇరుకుసందులన్నీ ఒడుపుగా తిరుగుతూ, ప్రశ్నించే ప్రజలతో గొంతు కలిపే నైజాన్నీ ఓటరు ఒడిసి పట్టుకున్నట్టున్నాడు మరి! కాకుంటే ఇది కలికాలం! ఎలక్షన్ల కాలంలో ప్రజలపై ప్రేమ అమాంతంగా పెరగడం సహజమేకదా అని సరిపెట్టుకుంటున్నాడు విధిలేక. అన్ని రాష్ట్రాలు మాచేతుల్లోనే ఉండాలనే జాతీయం, అన్ని అసెంబ్లీ సీట్లు మేమే గెలవాలనే రాష్ట్రీయంతో రసవత్తరమైన రాజకీయం నడుస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీపడుతూ మనదేశం ఐదవ స్థానంలో ఉంచామని చెబుతున్న కొందరు నాయకులకు తాము గెలిచి దేశాన్ని మరింత ముందుకు తీసుకోపోయేందుకు ప్రజలు కాకుండా మందిరాలో, మసీదులో ఎజెండాలు కావచ్చు. సరిహద్దులు, యుద్ధాలు, ఆక్రమణలు, పోరాటాలు, విజయాలు, పాత చరిత్రలచుట్టు అల్లుకుంటున్న వివాదాస్పద కొత్త సినిమాలపై కొందరి ప్రశ్నలు, మరికొందరి సమాధానాలు ఎన్నికల ఎజెండాలుగా రూపుమార్చుకోవచ్చు. అడ్డు తగులుతున్న పక్షాల ప్రశ్నలు అసలు లేకుంటే అభివృద్ధిలో దేశాన్ని ఒకటో స్థానంలో నిలబెట్టే అలోచనా అందిపుచ్చుకోవచ్చు. మూడు రెట్లు పెరిగిన పెట్రోలు 3 రూపాయలు తగ్గినా, ముందునెలలో వాచిపోయిన కరెంటుబిల్లు ఈనెల్లో కొద్దిగా తగ్గినా, నకిలీలతో నాణ్యతలేకున్నా, సగటు మనిషి సరిపెట్టుకోవడమే. ఎవరు జైలుకు వెళ్ళినా మరెవరు బెయిల్‌పై బయటకు వచ్చినా, ఎవరు కక్షకట్టినా, మరెవరు కరుణజూపినా, చట్టం, న్యాయం, ధర్మం అన్నీ కలగాపులగమైనా, ఎవరు మంచిచేసినా, మరెవరు మాయ చేసినా, ఎవరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినా, 'చంపేదెవరు? చచ్చేదెవరు?' అన్న సందేహం మనకు లేకుండా అంతా నా ఇచ్ఛ ప్రకారమే జరుగుతుందన్న' శ్రీకృష్ణ పరమాత్మ గీతా వచనాలను ఆదర్శంగా తీసుకొని ఓర్పుగా ఎదురు చూసే ప్రజలు అందరి నాయకులను సమానంగా ప్రతి ఐదేళ్ళకొకసారి 70 నుండి 80 శాతం ఓట్ల వాన నీటితో కడిగి నచ్చిన నాయకులను పునీతులుగా చేసి మళ్ళీ కడిగిన ముత్యంలా నిలబెట్టే ప్రజలవద్ద సరైన ప్రశ్నలు లేకపోవచ్చు, లేదా కొన్నిచోట్ల ఓటుకున్న రేటు, తీసుకున్న నోటుతో ఏదో జవాబు దొరికిందని సంతృప్తి పడవచ్చు. కొత్త ట్రెండ్‌లో పాంచ్ పచ్చీస్ న్యాయాలు, సూపర్ సిక్స్ గ్యారంటీలు, మేమంతా సిద్ధం, వికసిత్ భారత్‌లతో దేశవ్యాప్తంగా కనిపించని బ్రహ్మపదార్థమైన అభివృద్ధికోసం ప్రశార్థకంగా ఎదురు చూసే ప్రజలకు రాష్ట్రాల్లోను, కేంద్రాల్లోను ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలే అవసరంలేని ఎజెండాలతో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలకు ప్రశ్నలే మిగలకుండా పరిపాలించే నాయకులైతే మంచిదేగాని అసలు ప్రజలే లేకుండా, ప్రజలతో పనే లేకుండా చేసే పాలన గుర్తొస్తే మాత్రం కంగారే!

**– జోస్యుల వేణుగోపాల్, 9440436806**

# కళ్లులేని వ్యక్తి వందల కోట్ల సామ్రాజ్యానికి అధిపతి

– డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321



## భూమి మీదున్న సూరీడు శ్రీకాంత్ బొల్లా
## విద్యా వ్యవస్థపై పోరాడి గెలిచిన రియల్ హీరో

చీకటిని అసహ్యించుకోనేవారు కొందరు, చీకటిని చూసి భయపడేవారు ఇంకొందరు, చీకటిని చీల్చుకువెళ్ళేవారు మరికొందరు అలాంటి మూడవ రకంనకు చెందిన వాళ్ళను మూడక్షరాల పదంలో సూరీడు అంటారు. వైకల్యం శరీరాన్ని ఇబ్బంది పెడితే, ప్రతి చిన్నపనికీ మరొకరి సాయం అడగాల్సిరావడం మనసుని బాధిస్తుంది. శారీరకంగా మానసికంగా నిత్య పోరాటం చేస్తూనే తమ కాళ్ల మీద తాము నిలబడాలన్న ఆరాటంతో బయటకు వస్తే - బడీ వద్దంటే ఎక్కడికి వెల్లాలో ఎలా వెల్లాలో గమ్యం ఎలా చేరుకోవాలో ఇలా ఎన్నో ప్రశ్నలు మనసుని ఉక్కి రి బిక్కిరి చేస్తూ జీవితం పై నిరాశ ఎదురొచ్చిన కష్టాలు కనపడని ఆంధుడు ఇంటా బయటా విధికి ఎదురీది, విజేతలుగా నిలిచి, నేటి యువతకు స్ఫూర్తి నిస్తున్న వ్యక్తి  వందల కోట్ల సామ్రాజ్యానికి అధిపతి, విద్యా వ్యవస్థపై పోరాడి గెలిచిన రియల్ హీరో, భూమి మీదున్న సూరీడు అతడే శ్రీకాంత్ బొల్లా.

**బాల్యం బాధలతోనే**

మచిలీపట్నం జిల్లాలోని సీతారామపురం గ్రామం నకు చెందిన ఒక రైతుకుటుంబం లో 1992 జూలై 7 వ తేదీన శ్రీకాంత్ బొల్లా పుట్టినపుడు తల్లితండ్రులు సంతోషించలేదు. పైగా చాలా బాధ పడ్డారు. ఎందుకంటే అతను రెండు కనుగుడ్లు మూసుకుపోయి పుట్టాడు కాబట్టి. ఆ ఊరిజనం అయితే మరో అడుగు ముందుకేసి, ఆ పిల్లవాడిని ఎలా వదిలించుకోవాలో కూడా సలహాలు ఇచ్చారు. కానీ బొల్లా అమ్మ నాన్న అలా చేయలేదు. మేము బతికున్నంతవరకు వీడిని బాగా చూసుకొంటాం. మేము పోయాక దేవుడే చూసుకోవాలి అని ఊరివాళ్లతో అనేవారు.

**విద్యా వ్యవస్థపై పోరాడి గెలిచిన రియల్ హీరో**

కళ్ళు కనపడకపోవడం తప్ప, బడిలో శ్రీకాంత్ అందరికంటే చురుకుగా వుండేవాడు. కానీ ఇంటర్ సైన్స్ గ్రూప్ లో  నీవు అంధుడివి కాబట్టి సీటు ఇవ్వలేమని కాలేజీలు చెపితే శ్రీకాంత్ కోర్టుకెళ్ళి గెలిచి సీటు తెచ్చుకొన్నాడు. తోటి పిల్లల ఎగతాళి భరించలేక చదువు మానేసి రెండు ఏళ్ళు ఇంట్లోనే వుండిపోయాడు. మళ్ళీ హైదరాబాద్ లో ప్రత్యేక పాఠశాల లో చేరాడు. అక్కడకూడా పిల్లలు అవమానపెట్టారు. అందరూ తనను వదిలేసి వెళ్ళిపోతుంటే బాధ తట్టుకోలేక బడివదిలేసి పారిపోతుంటే ఒక్క ఉపాధ్యాయురాలు పట్టుకొని చెంపచెళ్ళుమనిపించింది. అదే అతని



జీవితం లో మలుపు తిరిగింది. ఆ టీచర్ ఆడియో టేపుల్లో పాఠాలు వినిపించింది. ఇంటర్ లో ఎమ్.పి.సి. చదివి తొంబై ఎనిమిది శాతం సంపాదించగా ఎగతాళి చేసినవారు అందరూ అవాక్కయ్యారు.

**ఐఐటీ నన్ను వద్దనుకుంటే ఐఐటీ కూడా వద్దు**

అంధత్వం కారణంగా అగ్రశ్రేణి భారతీయ విద్యా సంస్థ ఐఐటీ లచే ప్రవేశాన్ని తిరస్కరించబడిన తరువాత కళ్లులేవని ఐఐటీ వద్దంది నిరుత్సాహపడని శ్రీకాంత్ బొల్లా ఐఐటీ నన్ను వద్దనుకుంటే నాకు ఐఐటీ కూడా వద్దు అని అమెరికా లోని విశ్వవిద్యాలయం లకు ప్రవేశానికి పరీక్ష వ్రాస్తే ప్రఖ్యాత స్టాన్ ఫర్డ్ విశ్వవిద్యాలయం, మరో రెండు విశ్వవిద్యాలయంలు అడ్మిషన్ ఇవ్వడానికి ముందుకొచ్చాయి. శ్రీకాంత్ హెూవార్డ్ మసాచుసెట్స్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అమెరికా లో చేరాడు. అక్కడ బ్రైన్ కాగ్నిటివ్ సైన్స్ లో చేరిన తొలి అంధుడిగా రికార్డు పొందాడు. అతని ప్రతిభ చూసి, చదువు పూర్తి అయ్యాక నాలుగు అమెరికన్ కంపెనీ లు తమ దగ్గర ఉద్యోగం చేయమని అడిగితే శ్రీకాంత్ సున్నితంగా లేదు అని చెప్పాడు.  భారతదేశం చేరుకొని తనతోటి నిరుపేద, దివ్యాంగ భారతీయులకు సహాయపడే భాగ్యాన్ని నాకు ఇవ్వు అని అతను భగవంతుడిని ప్రతి రాత్రీ ప్రార్థించేవాడు. ఆ ప్రార్థనలు ఫలించాయి.

ప్రపంచం అంతా నువ్వు ఏమీ చేయలేవు అని చెబితే, ప్రపంచం వైపు తిరిగి చూసి నేను ఏదైనా చేయగలను అని నిరూపించిన వ్యక్తే బొల్లా హైదరాబాద్ కు 2012లో తిరిగి వచ్చిన శ్రీకాంత్ బొల్లాంట్ ఇండస్ట్రీస్ రతన్ టాటా సహాకారంతో నెలకొల్పి వికలాంగులకు ఉపాధిని అందిస్తున్నారు. అంధుడైన శ్రీకాంత్ బొల్లా చిన్నప్పటి నుంచి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని, దాదాపు రూ.500 కోట్ల విలువైన కంపెనీని సృష్టించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ యంగ్ గ్లోబల్ లీడర్స్ 2021 జాబితాలో బోల్లా పేరు కూడా ఉంది. ప్రస్తుతం బొల్లాంట్‌కు నాలుగు ఉత్పత్తి ప్లాంట్లు ఉన్నాయి, ఒక్కొక్కటి హుబ్లీ (కర్ణాటక) మరియు నిజామాబాద్ (తెలంగాణ), మరియు రెండు హైదరాబాద్ (తెలంగాణ). బొల్లాంట్ ఇండస్ట్రీస్ లో సుమారు 300 మంది దివ్యాంగులు ఉద్యోగాలు చేస్తున్నారు. బొల్లా 3000 మంది విద్యార్థులను చదివిస్తున్నాడు.

**నీకంటూ ఓ రోజు..... ఆత్మ విశ్వాసం కోల్పోవద్దు**

పుట్టుకతో వికలాంగులైన వారికి ప్రత్యేకమైన శక్తులుంటాయనే విషయమూ నిరూపించిన వారెందరో, చూపులేనివారు ఒక మారు విన్న స్వరాన్ని మరోమారువినగానే ఆవ్యక్తిని గుర్తిస్తారు. ఒక మారు స్పర్శ తగిలిన వారినీ రెండోమారు గుర్తించగలుగుతారు. వారికి గ్రహణ శక్తీ అధికంగానే ఉంటుంది. వికలాంగులు మానసికంగా ఆధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుకు దూసు కెళుతున్నారు. ఈరోజు కష్టంగా ఉండొచ్చు, రేపు ఇంకా కష్టంగా ఉండొచ్చు, కానీ నీ దంటూ ఓ రోజు మాత్రం ఖచ్చితంగా ఉంటుంది, కొంచం ఓపికగా భరించు, నీ ఆత్మ విశ్వాసం ఎప్పుడు కోల్పోవద్దు. దివ్యాంగులకు చెయూత నిద్దాం....వారికి గౌరవాన్ని అందిద్దాం, ఆదరిద్దాం, వారిలో దాగి ఉన్న అద్భుత శక్తులు ప్రపంచానికి తెలిసేలా చేద్దాం.

# దుర్గాదేవికి సింహం వాహనం ఎలా అయ్యిందంటే


ఏప్రిల్ 9వ తేదీ నుంచి చైత్ర నవరాత్రులు ప్రారంభమయ్యాయి. నవరాత్రి సమయంలో దుర్గాదేవి భక్తులు దేవి.. 9 రూపాలను పూజిస్తూ ఉపవాసం పాటిస్తారు. మత విశ్వాసాల ప్రకారం, దుర్గాదేవిని పూజించడం ద్వారా, కోరికలు నెరవేరుతాయి. అయితే దుర్గా 9 రూపాలకు వాహనాలు భిన్నంగా ఉంటాయి. కానీ అన్నీ సింహం స్వరూపంగానే ఉంటాయి. దుర్గమాత వాహనం సింహం ఎలా అయ్యిందో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం..

**పార్వతీ దేవికి శివునికి కోపం వచ్చినప్పుడు..** పురాణాల ప్రకారం.. పార్వతీ దేవి శివుడి అనుగ్రహం కోసం తీవ్రమైన తపస్సు చేసింది. తపస్సు వల్ల పార్వతీమాత శరీర రంగు నల్లగా మారుతుంది. ఒకసారి పరమశివుడు పార్వతీమాతతో సరదాగా మాట్లాడుతుండగా, పార్వతిని కాళీ అని పిలిచాడు. దీంతో పార్వతి తల్లికి కోపం వచ్చి కైలాస పర్వతాన్ని వదిలి తపస్సు చేసింది.

**పార్వతి దేవికి వరమిచ్చిన శివుడు..**పార్వతీ దేవి తపస్సులో మునిగి ఉండగా, ఒక సింహం తన వేట కోసం అక్కడికి వెళుతుంది. కానీ తపస్సులో మునిగి ఉన్న పార్వతీ దేవిని చూసి సింహం నిశ్శబ్దంగా అక్కడే కూర్చుంది. సింహం అక్కడే కూర్చుని పార్వతీ దేవి తపస్సు ఎప్పుడు ముగుస్తుందో అప్పుడే వేటకు వెళదామా అని ఆలోచించడం మొదలుపెట్టింది. ఈ తపస్సులో చాలా సంవత్సరాలు గడిచాయి. పరమశివుడు పార్వతీ దేవి కఠోర తపస్సుకు మెచ్చి ఆమెను గౌరీగా ఉండమని అనుగ్రహించాడు. ఆ తర్వాత, పార్వతీదేవి గంగా స్నానానికి వెళ్ళినప్పుడు, కౌశికి అని పిలువబడే ముదురు రంగు దేవత కనిపించి.. దేవిని మహాగౌరి అని పిలుస్తుంది.



**సింహానికి వరమచ్చిన పార్వతీ దేవి..** సింహం కూడా ఆకలితో, దాహంతో కూర్చోవడం పార్వతిదేవీ చూసింది. ఇది చూసిన పార్వతి మాత సింహానికి కూడా వరం ఇవ్వాలని భావించింది. దీంతో సింహాన్ని పార్వతీ దేవి తన వాహనంగా మారే అదృష్ట వరాన్ని అందిస్తుంది. దీని తరువాత దుర్గా మాతకు షెరావాలి అని పేరు పెట్టారు.



# మానవుడే మహనీయుడు

## ఏప్రిల్ 14న భారతజాతి నేత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి

**రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ ఆయన దళితుల హక్కుల కోసం పోరాడారు. లా అండ్ సోషల్ సైన్సెస్‌లో పట్టా పొంది తన చదువు బలంతో దళితుల హక్కుల కోసం పోరాడారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో బాబా సాహెబ్ అపూర్వమైన కృషి చేశారు. రాజ్యాంగంలో దళితులకు సమానత్వం, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన కథలు ఉన్నాయి. భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా తన సామాజిక సంస్కరణ పనులకు గౌరవించబడ్డాడు, ఇది అతనికి స్ఫూర్తినిస్తుంది. ఆదర్శ వ్యక్తిగా చూపుతుంది.**




స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న నాటి నాయకుల్లో ఉత్తమ జాతీయ గుణ సంపద కల్గిన గొప్ప వ్యక్తి డా.అంబేద్కర్. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్ళి కొలంబో విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పటాట పుచ్చుకున్న తొలి భారతీయుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, నైతిక విలువలకు కటుటబడి ఆదర్శజీవి తన సంపాదనలో 50శాతం పుస్తకాలకు ఖర్చు చేశారు. ఆయన దేశంలోని పేద, అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యానికై ప్రత్యేక నియోజకవర్గాల కోసం పోరాడి 1932లో పూణె ఒప్పందం చేసుకున్న రాజకీయ దురంధరుడు అంబేద్కర్ 1933లో 3వ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని రాజకీయ సమస్యలపై "బలహీన వర్గాల వాణిని" వినిపించిన ఆదర్శ రాజనీతిజ్ఞుడు. అంబేద్కర్ భారత రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడిగా ప్రపంచ రాజ్యాంగాలను అధ్యయనం చేసి, 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లో భారత రాజ్యాంగాన్ని పూర్తి చేసిన కార్యసాధకుడు 1951లో స్వతంత్ర్య భారతావనికి తొలి న్యాయశాఖ మంత్రి హోదాలో హిందూకోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన ధీశాలి. 1952లో దేశంలో నెలకొన్న విచిచన్న దురదృష్టకర సంఘటనలకు నిరసనగా న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి నైతిక విలువలకు దర్పణం పట్టిన రాజకీయ చాణక్యుడు. 1951 సెప్టెంబర్ 28న ప్రతిపఓ నాయకునిగా సభలోనికి అడుగుపెట్టారు. ప్రతిపఓ నాయకునిగా కూడా విశేష కృషి చేయగలరని అంబేద్కర్‌పై విశ్వాసాన్ని ప్రకటించారంత. అంబేద్కర్ మరింత స్వేచ్ఛగా ప్రసంగాలు మొదలు పెట్టారు. ఆయన అఖిల భారత నిమ్నజాతుల సమాఖ్య పేరిట జాతీయ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ పార్టీ 1952 ఎన్నికల్లో పోటీ చేసి 34లోకసభ స్థానాలకు అభ్యర్థులను నిలిపి రెండు స్థానాలను దక్కించుకుంది. ఆ రెండింటిలో ఒకటి మహారాష్ట్రలోని షోలాపూర్ కాగా రెండోది తెలంగాణలోని కరీంనగర్. ఆ ఎన్నికలో ఓడిపోయారు. అయితే కరీంనగర్ నుంచి ఎం.ఆర్.కృష్ణ గెలుపొందారు. వివిధ రాష్ట్రాల్లోని 215 శాసన సభ స్థానాలకు పోటీ చేయగా 12మంది గెలిచారు.

**(మిగతా 8వ పేజీలో)**

వారిలో ఐదుగురు హైదరాబాద్ రాష్ట్రం నుంచి ఇద్దరు మద్రాసు ప్రావిన్స్ (ఆంధ్ర ప్రాంతం ఇందులోనే ఉండేది) నుంచి గెలుపొందారు. హైదరాబాద్ అసెంబ్లీకి గెలిచిన వారిలో జె.ఎం. రాజమణి దేవి (సిరిసిల్ల), బి.ఎం.చందర్ రావు (మహబూబాబాద్), బుట్టి రాజారాం (జగిత్యాల), ఆంధ్ర ప్రాంతంలోని అమలాపురం నుంచి బొజ్జా అప్పలస్వామి ఉన్నారు.

ఆ తర్వాత అంబేద్కర్ ఆ పార్టీని మూసేసి అణగారిన వర్గాల వారి కోసం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రారంభించారు. హైదరాబాద్ రాష్ట్రంలో అంబేద్కర్‌కు మంచి అనుబంధం ఉంది. ఆయన తరచుగా హైదరాబాద్ వస్తుండే వారు. సమావేశాలలో పాల్గొనే వారు. సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ స్టేట్ డిప్రెస్స్ డ్ క్లాసెస్ అసోసియేషన్‌ల ఆహ్వానం మేరకు 1944 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు వచ్చారు. ఆయన్ను చూడడానికి ఆయన మాటలు వినడానికి జనం వెల్లువెత్తారు. హైదరాబాద్‌కు వచ్చారు. ఆయన్ను చూడడానికి ఆయన మాటలు వినడానికి జనం వెల్లువెత్తారు. హైదరాబాద్‌కు వస్తే ప్రముఖ రాజకీయ నాయకుడు జిహెచ్‌ఈ సుబ్బయ్య ఇంట్లో బస చేసేవారు. 1951 సెప్టెంబర్ 27న కేంద్రమంత్రి వర్గం నుంచి రాజీనామా చేసిన తరువాత వారం రోజుల పాటు సుబయ్య ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు. అంబేద్కర్ ఉస్మానియా యూనివర్సిటీ పరిసరాల్లోని పచ్చటి ప్రకృతి సౌందర్యాన్ని ఆయన బాగా ఇష్టపడేవారు. హైదరాబాద్ సంస్థానంలో తొలిసారిగా దళితుల సభ జరిపించారు అంబేద్కర్. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. ప్రజలకు సాంఘిక రాజకీయ అవగాహన కలిగించడం కోసం కొన్ని పత్రికలను స్థాపించి ఆ పత్రికలకు సంపాదకత్వం బాధ్యతలు కూడా ఆయనే నిర్వహించడం కోసం కొన్ని పత్రికలను స్థాపించి ఆ పత్రికలకు సంపాదకత్వం బాధ్యతలు కూడా ఆయనే నిర్వహించి పత్రికలను నడిపారు. ఆయన నడిపిన కొన్ని






పత్రికలు 1 మూక్ నాయక్ (మూడవారికి నాయకుడు), 2 బహిష్కల్ భారత్, 3 జనత, 4 పీపుల్స్ హెరెల్డ్, 5ప్రబుద్ధ భారత్ మొదలైనవి. అంబేద్కర్ మార్క్సిజాన్ని గుడ్డిగా అనుకరించలేదు పూర్తిగా తిరస్కరించను లేదు. మార్క్సిజంలోని మౌలిక సిద్ధాంతాన్ని భారత సామాజిక పరిస్థితులకు సమన్వయ పరిచే పంథాని ఆయన అనుసరించాడు. దీనికి సమాధానంగా బౌద్ధాన్ని ఆవిష్కరించాడు. స్వదేశీ సిద్ధాంతాన్ని ఆశ్రయించాడు. ఆయనలో జీర్ణించుకున్న జాతీయ తను ప్రదర్శించుకున్నాడు. భారతదేశాన్ని బుద్ధ భారతంగా తీర్చి దిద్దాలని కలలుగన్న బుద్ధ భారతం కలగా మిగిలి పోయింది. ఆయన బౌద్ధ ధర్మ దీక్ష తీసుకున్న 54 రోజులకు డాక్టర్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6వ తేదీన మరణించడం వల్ల ఆయన కలలు గన్న బుద్ధ భారతం కలగా మిగిలి పోయింది.

**(1891 ఏప్రిల్ 14 – 1956 డిసెంబర్ 6)**

**కొలనుపాక కుమారస్వామి, 9963720669**



## యుగపురుషుడు

**అంటరానితనాన్ని విద్యతో జయించి**
**జీవన శిఖరాలనధిరోహించిన గొప్ప**
**సమతావాది అంబేద్కరుడు..**
**మనిషిని మనిషిగా గుర్తించే సమసమాజ**
**స్థాపనకు నవభారత నిర్మాణానికి కలలు కన్న దార్శనికుడు..**
**అణచివేయబడ్డ అట్టడుగు వర్గాల**
**అభ్యున్నతి కోసం ఆజన్మాంతం శ్రమించేడు..**
**ఎంత ఎదిగి ఒదిగినా వదలని కుల**
**పంకిలాన్ని చూసి నివ్వెరపోయేడు..**
**హిందువుగా పుట్టినా హిందువుగా**
**మరణించనని బుద్ధం శరణం గచ్ఛామి**
**అంటూ బౌద్ధుడయ్యేడు..**
**నిష్కల్మష సంఘసంస్కర్తగా స్వాతంత్ర్య**
**ఉద్యమంలో భారత రాజకీయాల్లో**
**తనదైన శైలిలో విఖ్యాతి పొందేడు..**
**రాజ్యాంగ రచనలో మార్గదర్శిలా దారి**
**చూపి అసలైన అభ్యుదయవాదిగా**
**అందరి గుండెల్లో శాశ్వత చైతన్యమై..**
**చైత్యభూమి నుండే సకల భారతావనికి**
**వెలుగయ్యేడు..**

**భీమవరపు పురుషోత్తమ్, 9949800253**



# సినిమా రివ్యూ

అంజలి ప్రధాన పాత్రలో రూపొందిన 'గీతాంజలి' మంచి విజయం సాధించింది. పదేళ్ల తర్వాత ఆ సినిమాకు సీక్వెల్ 'గీతాంజలి మళ్లీ వచ్చింది' తీశారు. ఇది అంజలికి 50వ సినిమా కావడం విశేషం. శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేష్, 'షకలక' శంకర్, రవిశంకర్, అలీ, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్, రాహుల్ మాధవ్ ప్రధాన పాత్రల్లో శివ తుర్లపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ... కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లే, సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మించారు. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూదండి.

కథ :

తొలి సినిమా 'గీతాంజలి' విజయం తర్వాత దర్శకుడు శ్రీను (శ్రీనివాస రెడ్డి) వరుసగా మూడు ఫ్లాపులు ఇస్తాడు. దాంతో అతనితో సినిమా చేయడానికి ఎవరూ ముందుకు రారు. ఖర్చులకు డబ్బుల కోసం విశాఖలోని తన స్నేహితుడు అయాన్ (స్వామిరారా సత్య)ను మోసం చేస్తాడు. 'దిల్' రాజు సినిమా చేయడానికి ఒకే అన్నాడని, నువ్వే హీరో అని చెప్పడంతో లక్షలకు లక్షలు డబ్బులు పంపిస్తాడు అయాన్. శ్రీనుకు చెప్పకుండా హైదరాబాద్ వచ్చిన అయాన్ అసలు నిజం తెలుసుకుంటాడు. చేసేది లేక రైటర్స్ ఆరుద్ర, ఆత్రేయ ('సత్యం' రాజేష్, 'షకలక' శంకర్)తో పాటు శ్రీను, అయాన్ ఇంటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటారు.

కృష్ణానగర్ వదిలేసి ఇళ్లకు బయలుదేరుతున్న సమయంలో ఊటీలోని విష్ణు రిసార్ట్స్ యజమాని విష్ణు (రాహుల్ మాధవ్) మేనేజర్ గోవిందా గోవిందా (శ్రీకాంత్ అయ్యంగార్) నుంచి ఫోన్ వస్తుంది. డైరెక్షన్ ఛాన్స్ ఆఫర్ చేయడం అందరూ ఊటీకి వెళతారు. తాను రాసిన కథతో సంగీత్ మహల్‌లో షూటింగ్ చేయాలని విష్ణు పెట్టిన కండిషన్‌కు ఒకే చెప్పడంతో పాటు హీరోయిన్‌గా అంజలి (అంజలి)ని ఒప్పించి సినిమాను సెట్స్ మీదకు తీసుకు వెళతారు. సంగీత్ మహల్‌లో శాస్త్రి (రవిశంకర్), ఆయన భార్య (ప్రియా) ఆత్మలు ప్రతి ఆగస్ట్ 8కి



ప్రేమికుల మీద పగ తీర్చుకుంటాయని ఊటీ ప్రజల నమ్మకం. సంగీత్ మహల్‌లో నిజంగా ఆత్మలు ఉన్నాయా? ఒకవేళ ఉంటే అక్కడ అంజలి, శ్రీను %డ% గ్యాంగ్ షూటింగ్ ఎలా చేశారు? అంజలి సోదరి గీతాంజలి (అంజలి) ఆత్మ మళ్లీ ఎందుకు వచ్చింది? గీతాంజలి చేతిలో మరణించిన రమేష్ (రావు రమేష్)కు, విష్ణుకు సంబంధం ఏమిటి? చివరకు ఏమైంది? అనేది మిగతా సినిమా.

విశ్లేషణ :

హారర్ కామెడీ తెలుగులో అరగదీసిన ఫార్ములా. పదేళ్ల క్రితం 'గీతాంజలి' వచ్చినప్పుడు ఎక్కువ సినిమాలు రాలేదు. కానీ, ఆ తర్వాత కుప్పలు తెప్పలుగా వచ్చాయి. అందువల్ల, సంథింగ్ స్పెషల్ అన్నట్టు ఉంటే తప్ప ప్రేక్షకులు హారర్ కామెడీ ఫిల్మ్స్ చూడటం లేదు. ఆ స్పెషల్ మూమెంట్స్ 'గీతాంజలి మళ్లీ వచ్చింది' ఉన్నాయా? అంటే... 'లేవు' అని చెప్పాలి. రెగ్యులర్ అండ్ రొటీన్ కథతో 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా తెరకెక్కింది. ఫస్ట్ పార్టుతో ఈ కథను లింక్ చేయాల్సిన అవసరం లేదు. ఆ సినిమా చూడని వాళ్లకు సైతం ఈ కథ అర్థం అవుతుంది. ఎందుకంటే... 'గీతాంజలి'లో ఉన్న ఎమోషన్ ఈ కథలో క్యారీ చేయడంలో దర్శక రచయితలు ఫెయిల్ అయ్యారు. కామెడీ, కామెడీ, కామెడీ... ఎంతసేపూ నవ్వించడం మీద దృష్టి పెట్టారు తప్ప ఎమోషన్ గురించి కేర్ తీసుకోలేదు. కామెడీ 100 పర్సెంట్ వర్కవుట్ అయినప్పుడు కథ, ఎమోషన్స్ సోసో అనిపించినా ప్రేక్షకుడు పెద్దగా పట్టించుకోడు. కామెడీ తగ్గినప్పుడు మిగతా అన్నీ లెక్కల్లోకి వస్తాయి.

పాడుబడిన బంగ్లాలో హారర్ సినిమా తీయడానికి వెళ్లిన కొంత మందికి నిజమైన దెయ్యాలు ఎదురైతే ఏం జరిగింది? అనేది క్లుప్తంగా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' కథ. సినిమా స్టార్టింగ్ సోసోగా ఉంది. ఫస్టాఫ్ అంతా రొటీన్. ఇంటర్వెల్ తర్వాత షూటింగులోకి దెయ్యాలు వచ్చిన తర్వాత కోన వెంకట్ %డ% రైటర్స్ నుంచి కొన్ని మంచి సీన్లు వచ్చాయి. నవ్వులు పూశాయి. సినిమాటిక్ లిబర్టీ మరీ ఎక్కువ తీసుకుని క్లైమాక్స్ రాశారు. దాంతో ఎటువంటి ఫీలింగ్ ఉండదు. సుజాత సిద్ధార్థ సినిమాటోగ్రఫీ బావుంది. ప్రవీణ్ లక్కరాజు పాటలు ఓకే. క్లైమాక్స్ రీ రికార్డింగ్, ఆ సాంగ్ వింటే 'హనుమాన్'లో రామదూత స్తోత్రం గుర్తుకు వస్తుంది. ప్రొడక్షన్ వేల్యూస్ ఓకే.

అంజలికి సవాల్ విసిరే సన్నివేశాలు సినిమాలో లేవు. కాఫీ షాప్ యజమానిగా, తన స్నేహితుల కోసం హీరోయిన్ రోల్ ఓకే చేసిన అమ్మాయిగా తనదైన శైలిలో ఆమె నటించారంతే. క్లాసికల్ డ్యాన్సర్ గెటప్ ఆమెకు బావుంది. పతాక సన్నివేశాల్లో నటన మాత్రమే కాస్త కొత్తగా ఉంది. శ్రీనివాస రెడ్డి, రవిశంకర్, 'సత్యం' రాజేష్, 'షకలక' శంకర్, శ్రీకాంత్ అయ్యంగార్, ముక్కు అవినాష్ తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు. మలయాళ నటుడు రాహుల్ మాధవ్ లుక్స్ ఓకే. అతనికి ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమాల్లో ఛాన్సులు రావచ్చు.

సినిమాలో తీసే సినిమాలోనే కాదు, ఈ 'గీతాంజలి మళ్లీ వచ్చింది'కి అసలైన హీరో 'స్వామి రారా' సత్య. ఇంటర్వెల్ తర్వాత సన్నివేశాల్లో చెలరేగిపోయాడు. అతను స్క్రీన్ మీదకు వచ్చిన ప్రతిసారి థియేటర్లలో నవ్వులు వినబడతాయి. ఒకానొక సమయంలో సత్య నటనను సునీల్ ఇమిటేషన్ అని కొందరు అన్నారు. ఆ సునీల్, సత్య కాంబినేషన్ సీన్లు సైతం బాగా నవ్విస్తాయి. సినిమాటోగ్రాఫర్ కిల్లర్ నానిగా సునీల్ క్యారెక్టర్ చేస్తే... ఓ ప్రముఖ తెలుగు సినిమాటోగ్రాఫర్ గుర్తుకు వస్తారు. 'దిల్' రాజు, గోపరాజు రమణ, సురేష్ కొండేటి అతిథి పాత్రల్లో సందడి చేశారు.

'గీతాంజలి మళ్లీ వచ్చింది' కథలో షాకింగ్ ట్విస్ట్ లేదా సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఏమీ లేవు. స్టార్టింగ్ టు ఎండింగ్ ప్రేక్షకుడి ఊహకు అనుగుణంగా సినిమా వెళుతుంది. నో హారర్ మూమెంట్స్ అండ్ నో థ్రిల్స్... జస్ట్ 'స్వామి రారా' సత్య కామెడీ తప్ప! 'గీతాంజలి' మేజిక్, ఆ హ్యూమర్ రిపీట్ చేయడంలో ఈ సినిమా ఫెయిలైంది.

బాలీవుడ్‌లో 2024 సంవత్సరానికి సంబంధించిన మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో ఒకటి 'బడే మియా చోటే మియా'. యాక్షన్ హీరోలు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ కథానాయకులుగా కనిపించిన ఈ సినిమాలో వీరికి ప్రతినాయకుడిగా 'సలార్'లో రాజమన్నార్‌గా అలరించిన పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. ఇంత క్రేజీ కాంబినేషన్‌తో తెరకెక్కినప్పటికీ ఈ సినిమాపై ఆశించిన స్థాయిలో బజ్ కనిపించడం లేదు. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ లేకపోవడంతో రిలీజ్‌ను కూడా ఒక రోజు వాయిదా వేశారు మేకర్స్. కానీ ఈ కాంబినేషన్ క్రేజ్‌కి, యాక్షన్ జానర్‌కి కాస్త పాజిటివ్ టాక్ తోడయితే వసూళ్లు ఒక రేంజ్‌లో వస్తాయి. మరి సినిమా ఎలా ఉంది?

**కథ:** భారత సైన్యానికి సంబంధించిన మోస్ట్ అడ్వాన్స్ టెక్నాలజీని ఒక చోట నుంచి మరో చోటికి తరలిస్తుండగా ఒక ముసుగు మనిషి దాన్ని దొంగలిస్తాడు. ఆ తర్వాత 72 గంటల్లోనే భారత దేశాన్ని అంతం చేస్తానని ఆర్మీకి వీడియో మెసేజ్ పంపిస్తాడు. అతన్ని ఆపడానికి సైన్యం బయట వ్యక్తులు అవసరం అని కోర్టు మార్షల్ అయిన కెప్టెన్ ఫిరోజ్ అలియాస్ ఫ్రెడ్డీ (అక్షయ్ కుమార్), కెప్టెన్ రాకేష్ అలియాస్ రాకీలని (టైగర్ ష్రాఫ్) తిరిగి రప్పిస్తారు. ఇంతకీ ఆ ముసుగు మనిషి తీసుకెళ్లిన టెక్నాలజీ ఏంటి? ఫ్రెడ్డీ, రాకీ దాన్ని కాపాడారా? ఈ మొత్తం కథలో కబీర్ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఎవరు? ఇలాంటివన్నీ తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణ:** ఈ మధ్య బాలీవుడ్‌లో దేశభక్తి ఆధారంగా రూపొందుతున్న యాక్షన్ సినిమాలు ఎక్కువ అయిపోతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికే 'ఫైటర్', 'యోధ' సినిమాలు ఈ జోనర్‌లో విడుదల అయ్యాయి. వీటిలో 'ఫైటర్' పర్వాలేదనిపించగా, 'యోధ' బోల్తా కొట్టేసింది. 'బడే మియా చోటే మియా' కూడా ఈ తరహా సినిమానే. కానీ ఈసారి సైన్స్ ఫిక్షన్ టచ్ యాడ్ చేశారు. ఈ సినిమా చాలా నార్మల్‌గా స్టార్ట్ అవుతుంది. మొదటి 40 నిమిషాలు పూర్తిగా యాక్షన్ సీన్లే ఉంటాయి. అవి తెర



మీద చూడటానికి చాలా బాగుంటాయి కానీ నిడివి మాత్రం చాలా ఎక్కువ. స్క్రీన్‌పై అలా సాగుతూనే ఉంటాయి. దీంతో వారి కష్టం తెరపైన కనిపిస్తున్నా మనం థ్రిల్ ఫీలవ్వలేం.సినిమా ఫస్టాఫ్‌లో సగం పాత్రల పరిచయానికే సరిపోతుంది. ఎప్పుడైతే స్టోరీ లండన్‌కు షిఫ్ట్ అవుతుందో అక్కడ నుంచి కాస్త ఊపు అందుకుంటుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండాఫ్ మీద ఆసక్తిని పెంచుతుంది. కానీ సెకండాఫ్ మొదలయ్యాక గ్రాఫ్ ఒక్కసారిగా కిందికి పడిపోతుంది. సమయం సందర్భం లేకుండా టైగర్ ష్రాఫ్ చేసే కామెడీ విసిగిస్తుంది. గట్టిగా చెప్పాలంటే ఒకట్రెండు చోట్ల మాత్రమే టైగర్ ష్రాఫ్ వేసే పంచులు నవ్విస్తాయి. సినిమాలో పాటలు కథకు అడ్డం పడతాయి. క్లైమ్యాక్స్ యాక్షన్ సీన్లను చాలా బాగా డిజైన్ చేశారు. కానీ నిడివి చాలా ఎక్కువ. కేవలం ఈ ఒక్క యాక్షన్ సీన్ నిడివే దాదాపు అరగంటకు పైగా ఉ ంటుంది. రెండు గంటల 45 నిమిషాల సినిమాలో రెండు గంటల వరకు యాక్షన్ సీన్లే ఉంటాయి. మిగతా 45 నిమిషాల్లో చాలా జాగ్రత్తగా కథని సర్దారు.

విలన్ పాత్రపై సానుభూతి కలిగేలా రాసుకోవడం పెద్ద మైనస్. యాక్షన్‌లో ఇతర జోనర్లకు అది వర్కవుట్ అవుతుందేమో కానీ ఇలాంటి పేట్రియాటిక్ సినిమాల్లో అలా ఉంటే కష్టం. ఈ సినిమాలో ఉ న్న అన్ని పాత్రల్లో కాస్త క్యారెక్టర్ ఆర్క్, డెప్త్ ఉ న్నది పృథ్వీరాజ్ పోషించిన కబీర్ పాత్రకే. హీరోలు ఇద్దరూ తమకు ప్రాణ స్నేహితుడు అని చెప్పుకునే పాత్రని చంపే సీన్ ఒకటి ఉంటుంది. ఎంత చెడ్డవాడైనా ప్రాణ స్నేహితుడ్ని చంపేటప్పుడు కాస్త బాధ కలగడం సహజమే. కానీ 'కుక్కకి పిచ్చి ఎక్కువ అయింది' అని ఆ పాత్రని చంపడమే చెప్పవచ్చు హీరోల క్యారెక్టర్స్‌ని ఎంత బలంగా రాసుకున్నారో.జూలియన్ పాకియం నేపథ్య సంగీతం ఆకట్టుకుం టుంది. యాక్షన్ సీన్లను ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఎలివేట్ చేసింది. మార్సిన్ లస్కావీక్ ఛాయాగ్రహణం ఓకే ఓకే. ఈ సినిమాకు 3డీ టెక్నాలజీ అనవసరం. ఎక్కడా 3డీ ఎఫెక్ట్‌లు సరిగ్గా లేవు.

**ఇక నటీనటుల విషయానికి వస్తే...** సినిమా మొత్తంలో నటనకు స్కోప్ ఉన్న క్యారెక్టర్ ఉన్నది కేవలం పృథ్వీరాజ్ సుకుమారన్‌కే. కబీర్ పాత్రలో పృథ్వీరాజ్ చాలా బాగా నటించారు. గతంలో ఇంతకంటే మంచి పాత్రల్లో పృథ్వీరాజ్ నటించినా... చుట్టుపక్కల ఉన్నవాళ్లకు ఏ మాత్రం పెర్ఫార్మ్ చేయకపోవడమో, వారి పాత్రలకు స్కోప్ లేకపోవడం వల్లనో కానీ బాగా ఎలివేట్ అయ్యారు. నో ఎమోషన్, ఓన్లీ యాక్షన్ పాత్రల్లో అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ శక్తివంచన లేకుండా కృషి చేశారు. మానుషి చిల్లర్‌కు కూడా యాక్షన్ సన్నివేశాల్లో స్కోప్ ఉన్న పాత్ర లభించింది. మిగతా పాత్రలు పోషించిన వారు బాగానే నటించారు.

**ఓవరాల్‌గా చెప్పాలంటే...** కథతో సంబంధం లేదు జస్ట్ హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ఉంటే చాలు అనుకుంటే ఈ 'బడే మియా చోటే మియా' ట్రై చేయవచ్చు. 3డీ వెర్షన్ కంటే 2డీ వెర్షన్ చూడటమే బెటర్.

# సినిమా రివ్యూ

దర్శకుడు ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ తెరకెక్కించిన సినిమా 'శ్రీరంగ నీతులు'. మూడు కథల సమాహారంగా తెరకెక్కిన యాంథాలజీ ఫిల్మ్. ఓ కథలో సుహాస్, మరో కథలో కార్తీక్ రత్నం హీరోలు. ఇంకో కథలో విరాజ్ అశ్విన్, రుహానీ శర్మ జంటగా నటించారు. వాసు ఇంటూరి, దేవి ప్రసాద్, సీవీఎల్ నరసింహా రావు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. రంజాన్ సందర్భంగా గురువారం (ఏప్రిల్ 10న) థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.



కథ :

బస్తీలో కుర్రాడు (సుహాస్)కి స్కూల్ గ్రౌండులో తన ఫోటోతో పెద్ద ఫ్లెక్సీ పెడతాడు. దాన్ని ఎవరో తీసేస్తారు. మరో ఫ్లెక్సీ వేయించే డబ్బులు ఉండవు. కొత్త ఫ్లెక్సీ వేయించాలనే పట్టుదలతో ఏం చేశాడు? అనేది ఓ కథ. కొడుకు (కార్తీక్ రత్నం) మందు, గంజాయికి బానిస అయ్యాడని బాధ పడుతుంటే... అతడిని పట్టుకోవడం కోసం పోలీసులు రావడంతో తండ్రి (దేవి ప్రసాద్) తప్పించే ప్రయత్నం చేసి పోలీసులకు చిక్కుతాడు. ఆ తర్వాత ఏమైంది? తండ్రి కోసం కొడుకు వచ్చాడా? లేదా? అనేది మరో కథ.

తన ప్రేమ విషయం ఇంట్లో చెప్పలేక, పెద్దలు చూసిన సంబంధం చేసుకోలేక తనలో తాను సతమతం అవ్వడమే కాదు... లవర్ (విరాజ్ అశ్విన్)కు కోపం తెప్పిస్తుంది ఓ అమ్మాయి (రుహానీ శర్మ). చివరకు, వాళ్లు కలిశారా? లేదా? అనేది ఇంకో కథ.సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ... ముగ్గురిలో మార్పు వచ్చిందా? లేదా? మూడు కథలు ఎక్కడైనా కలిశాయా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ

: ఒక్క ఛాన్స్... ఒకే ఒక్క ఛాన్స్ ఇస్తే తమ టాలెంట్ ప్రూవ్ చేసుకుంటామని ఇండస్ట్రీలో చెప్పే ఆర్టిస్టులు, దర్శక రచయితలు ఎందరో! 'ఖడ్గం'లో రవితేజ, సంగీత చేత కృష్ణవంశీ సైతం ఆ మాటే చెప్పించారు. అయితే... దర్శకుడు ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ ప్రతి మనిషికి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని చెప్పారు 'శ్రీరంగ నీతులు' సినిమాలో!

ఒకరి (సుహాస్)ది పేరు కోసం ఆరాటం అయితే... మరొకరి (రుహానీ శర్మ)ది పరువు కోసం పడే ఆలోచన... ఇంకొకరు (కార్తీక్ రత్నం)ది వైఫల్యాలను మరొకరిపై నెట్టేసి మత్తులో దాక్కునే నైజం. పేరు, పరువు, ఫెయిల్యూర్... సమాజంలో చాలా మంది ప్రవర్తనలకు కారణం అవుతాయని, ఆ ప్రవర్తనలకు కారణం తోటి మనుషులేనని, ఒకరిని నిందించడం మానేసి మారడానికి అవకాశం ఇవ్వాలని చెప్పే కథ 'శ్రీరంగ నీతులు'.

దర్శకుడు ప్రవీణ్ కుమార్ చెప్పాలనుకున్న పాయింట్ బావుంది. అయితే, క్లారిటీ లోపించింది. ఫ్లెక్సీ అంటే అంత సుహాస్ కు ఎందుకంత ఇష్టం అనేది తెలియదు. గంజాయికి కార్తీక్ రత్నం ఎందుకు బానిస అయ్యాడో క్లారిటీ లేదు. ఆ రెండు కథల్లోని హీరోల్లో మార్పుకు కారణాలు కూడా కన్విన్సింగ్‌గా లేవు. దాంతో ఎంత సేపటికీ కథ ముందుకు వెళ్లిన ఫీలింగ్ కలగదు. పైగా, లెంగ్త్ ఎక్కువైన ఫీల్ కలిగి బోర్ కొడుతుంది. మధ్య మధ్యలో రెండు మూడు సన్నివేశాలు నవ్వించాయి. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత పాటలు గుర్తు ఉండవు. నేపథ్య సంగీతం పర్వాలేదు.

విరాజ్ అశ్విన్, రుహానీ శర్మ కథను మాత్రం చక్కగా రాసుకున్నారు. ఉన్నంతలో మంచిగా ప్రజెంట్ చేశారు. వాళ్లిద్దరి నటన పాత్రలకు సూటయ్యింది. ఈ కథలో అవసరాల శ్రీనివాస్ అతిథి పాత్రలో నటించారు. బాయ్ ఫ్రెండ్, బ్రేకప్, మ్యారేజ్ ప్రపోజల్ గురించి ఆయన చెప్పే డైలాగులు యువతకు కనెక్ట్ కావచ్చు. తనికెళ్ల భరణి ఈ మూడు కథలను చెప్పే ప్రవచనకర్తగా కనిపించారు.

'శ్రీరంగ నీతులు' తరహా కథలు, కాన్సెప్టులు ఓటీటీలకు బావుంటాయి. రెండున్నర గంటలు థియేటర్లలో ప్రేక్షకులను కూర్చోబెట్టాలంటే 'వేదం' తరహాలో బలమైన సన్నివేశాలు, సంభాషణలు, భావోద్వేగాలు ఉండాలి. ఈ సినిమాలో అటువంటివి ఏవీ లేవు. షార్ట్ ఫిలింకు ఎక్కువ, ఓటీటీ ఫిలింకి తక్కువ అన్నట్టుంది సినిమా. ఈ కథలు ప్రేక్షకుల్ని మెప్పించడం చాలా చాలా కష్టం సుమా! ఒకవేళ చెబితే... 'శ్రీరంగ నీతులు' వినడానికి బావుంటాయేమో!? కానీ, థియేటర్లలో చూసేందుకు కాదు!

---

సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన కొత్త సినిమా 'డియర్' (%ణముతీ వీశీజఱవ%). కంటెంట్ బేస్డ్ సినిమాలతో ప్రేక్షకులలో తనకు అంటూ మంచి పేరు తెచ్చుకున్నారు. గురక నేపథ్యంలో 'డియర్' తీయడం... ఐశ్వర్యా రాజేష్ కథానాయక కావడం... సిమిలర్ కాన్సెప్ట్ బేస్డ్ ఫిల్మ్ 'గుడ్ నైట్' విమర్శకులతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవడంతో సినిమా ఎలా ఉంటుందోనని అందరూ ఆసక్తి ఎదురు చూశారు. మరి, ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూడండి.



కథ:

అర్జున్ (జీవీ ప్రకాష్ కుమార్) న్యూస్ రీడర్. టీవీలో ఫేస్ ఫ్రెష్ గా కనిపించడం కోసం ప్రతి రోజూ తప్పకుండా ఎనిమిది గంటలు నిద్ర పోతాడు. చిన్న శబ్దం వినిపడినా నిద్ర లేస్తాడు. దీపిక (ఐశ్వర్యా రాజేష్)తో అతడికి పెళ్లి జరుగుతుంది. నిద్రపోతే భయంకరంగా గురక పెట్టే అలవాటు ఆమెకు ఉంది. హనీమూన్ టూరులో, పెళ్లైన కొత్తలో కొన్ని రోజులు ఇద్దరికీ భారంగా గడుస్తుంది. ఆ తర్వాత ఓ నిర్ణయానికి వస్తారు... రాత్రి ఒకరు నిద్రపోతే మరొకరు మెలకువగా ఉండాలని! మెలకువగా ఉన్నవారు మరుసటి రాత్రి నిద్రపోతే, ఇంకొకరు మెలకువగా ఉండాలని నిద్రలేకుండా ఆఫీసుకు వెళ్లిన అర్జున్... కీలకమైన ఇంటర్వ్యూ చేసే అవకాశం వచ్చినప్పుడు బాత్ రూంలో నిద్రపోవడంతో ఉద్యోగంతో పాటు పరువు పోతుంది. ఆ తర్వాత దీపికకు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు. అమ్మ (రోహిణి), అన్నయ్య (కాళి వెంకట్) చెప్పినా వినడు. మరోవైపు విడాకులు ఇవ్వనని, భర్తతో కలిసి జీవించాలని కోరుకుంటున్నట్టు దీపిక చెబుతుంది. విడాకుల కేసు కోర్టులో ఉండగా దీపిక ప్రెగ్నెంట్ అవుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అర్జున్ ఫ్యామిలీ నేపథ్యం ఏమిటి? అతడి తండ్రి కథ ఏమిటి? అర్జున్, దీపిక మళ్లీ ఒక్కటి అయ్యారా? లేదా? అనేది మిగతా సినిమా.

విశ్లేషణ :

గురక పెట్టే భార్య తనకు వద్దని కోర్టులో కేసు వేసిన అర్జున్ మీద ఫస్ట్ హియరింగ్ తర్వాత అన్నయ్య చరణ్ లాగిపెట్టి ఒక్కటి కొడతాడు. కట్ చేస్తే... 'నీ కళ్లు చెబుతున్నాయి నన్ను ప్రేమించావని' సాంగ్ వస్తుంది. చెంప మీద బీర్ బాటిల్ పెట్టుకుని హీరో కనిపిస్తాడు. కోర్టులో జరిగిన సన్నివేశానికి, తర్వాత వచ్చిన పాట %ఔ% సన్నివేశానికి సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదు కదా! గురకకు, ఈ సినిమా కథకు సైతం సంబంధం లేదు. ప్రతి ఒక్కరిలో లోపాలు ఉంటాయని, అయితే వాటిని అధిగమించి జీవిత భాగస్వామిని అంగీకరించడమే జీవితమని చెప్పే చిత్రమిది.

'డియర్' ట్రైలర్ విడుదలైనప్పుడు 'గుడ్ నైట్'తో కంపేరిజన్స్ వచ్చాయి. ఓ కొత్త సినిమాకు ఉండే అడ్వాంటేజ్ అప్పుడే మిస్ అయ్యింది సినిమా. 'గుడ్ నైట్'లో హీరో గురక పెడితే... 'డియర్'లో హీరోయిన్ గురక పెడుతుంది. గురక వల్ల సంసార జీవితంలో సమస్యలు వస్తాయని ప్రేక్షకుడు ఊహిస్తాడు. అతడి ఊహకు అందని విధంగా సన్నివేశాలు, కథనం ఉన్నప్పుడు మాత్రమే సినిమా ఆసక్తిగా ముందుకు కదులుతుంది. దర్శకుడు ఆనంద్ రవిచంద్రన్ ఆ తరహాలో సినిమాను ముందుకు తీసుకు వెళ్లడంలో దారుణంగా విఫలమయ్యారు.

ఆల్రెడీ ఆడియన్స్ గురక కాన్సెప్ట్ చూసేశారు. పోనీ, గురక వల్ల వచ్చే సన్నివేశాలు గానీ... ఆ తర్వాత కథ, కథనం గానీ ఏమంత ఆసక్తిగా లేవు. అసలు ఈ సినిమాకు ప్రధాన సమస్య గురక కాదు. హీరో హీరోయిన్ల క్యారెక్టర్లు డిజైన్ చేసిన విధానం! 'ఒక న్యూస్ రీడర్ అయ్యి ఉండి గురకను సాకుగా చూపించి విడాకులు అడుగుతున్నావ్ ఏంటి?' అని హీరోని జడ్జ్ ప్రశ్నిస్తారు. నిజమే కదా అని ప్రేక్షకుడు ఆలోచిస్తే అసలు హీరో వాదనలో బలం లేదని అనిపిస్తుంది. బహుశా... దర్శకుడు కూడా ప్రేక్షకుడికి ఆ ఫీలింగ్ కలగాలని ఆ సీన్, డైలాగ్ రాసి ఉంటారు. అది రివర్స్ అయ్యింది. గురక మీద ఫస్టాఫ్ అంతా నడిపించిన దర్శకుడు... ఇంటర్వెల్ తర్వాత, ముఖ్యంగా పతాక సన్నివేశాలకు ముందు హీరో తల్లిదండ్రుల మీదకు దృష్టి సారించారు. 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం'తో పాటు కొన్ని సినిమాల్లో ఆ తరహా ఎమోషన్స్ ఉన్నాయి. ఆ పేరెంట్స్ ట్రాక్ కూడా కొత్తగా లేదు. భావోద్వేగాలు సైతం పండలేదు.

అంతకు ముందు సన్నివేశాల్లో కామెడీ కూడా వర్కవుట్ అవ్వలేదు. దర్శకుడు ఎంపిక చేసుకున్న కథ, కథనం, సన్నివేశాల్లో బలం లేదు. దాంతో హీరో హీరోయిన్లు జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్యా రాజేష్ తమ ప్రతిభ చూపించడానికి పెద్దగా అవకాశం లేకుండా పోయింది. సన్నివేశాలకు తగ్గట్టు చేసుకుంటూ వెళ్లారు తప్ప నటనలో అద్భుతాలు చూపించిన మూమెంట్స్ ఏమీ లేవు. రోహిణి నటించడం వల్ల కొన్ని సన్నివేశాలకు హుందాతనం వచ్చింది. హీరో అన్నయ్యగా కాళీ వెంకట్ నటన బావుంది. ఆయన సీన్లు మాత్రమే కొంత నవ్విస్తాయి. హీరోగా కంటే సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాష్ కుమార్ మెరిశారు. రెండు పాటలు, నేపథ్య సంగీతం పర్వాలేదు. పాటల్లో సినిమాటోగ్రఫీ బావుంది. 'డియర్'లో హీరోయిన్ గురక పెట్టడం మొదలు పెడితే... ఆమెను నిద్ర లేపడానికి హీరోకి కొంత సమయం పడుతుంది. ఆమె గురక సంగతి ఏమో గానీ దర్శకుడు ఆనంద్ రవిచంద్రన్ తెరకెక్కించిన తీరు వల్ల థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకులకు నిద్ర వచ్చేలా ఉంది. కాన్సెప్ట్ బావుంది. కానీ, సినిమాలో కామెడీ లేదు. ఎంగేజ్ చేసే సీన్లు లేవు. కనెక్ట్ అయ్యేలా ఎమోషన్స్ లేవు. గురక తప్పిస్తే... కథ, స్క్రీన్ ప్లే, సన్నివేశాలు రొటీన్.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 14.4.2024 నుంచి 20.4.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ఈవారం ఈ రాశి వారి జీవిత భాగస్వామి ఆదాయం పెరుగు తుంది. మీ అదనపు ఆదాయం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి గురువులను కలుసుకుంటారు పుణ్య కార్యక్రమాల కొరకు విద్యార్థుల చదువు కొరకు సహాయం చేస్తారునూతన ఉపాధి కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రభుత్వానికి చెల్లించవలసిన బకాయిలు చెల్లిస్తారు అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుంది బంధువులకు ఆర్థిక సహాయం చేస్తారు, రుణాలు తీర్చే ప్రయత్నం చేస్తారు .అమ్మకాలు లేదా కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్త వహించడం మంచిదివృత్తిలో ఇతరుల సలహా ఇబ్బంది కలిగిస్తుంది తప్పనిసరిగా మీకు ఇష్టం లేకపోయినా కొన్ని పనులు చేయవలసి ఉంటుంది రుణ యత్నం ఫలిస్తుంది మీ ఆత్మీయులు ఒకరు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసే అవకాశాలు ఉన్నాయి.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

ఈవారం ఈ రాశి వారికి ఈ వారం ప్రారంభంలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు ఏర్పడతాయి తండ్రిగారి ద్వారా లేదా ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారం కలుగుతుంది. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఆలోచనల్లో అనుకూలత కలిగే అవకాశం ఉంది. పిల్లల విషయంలో ఆదాయ పరముగా శుభవార్తలు వింటారు కుజగ్రహము యొక్క సంచారం వలన స్థిరాస్తుల పై పెట్టుబడి పెడతారు వ్యక్తిగత పనులు తొందరగా పూర్తి చేస్తారు దగ్గరలో ఉన్న స్నేహితులను కలుసుకుంటారు. అదనపు ఆదాయం కొరకు ప్రయత్నము చేస్తారు. వ్యాపారంలో మార్పుల కొరకు. పరిచయం లేని వ్యక్తుల కొరకు ధనం ఖర్చు పెడతారు. వారం చివరలో కొత్త ఆలోచనలు, వృత్తిలో అవకాశములు ఏర్పడతాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ఈ రాశివారు చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఆత్మీయులను కలుసుకుంటారు ప్రారంభంలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు ఏర్పడతాయి మంచి గురువు లభించటం వలన అనుకున్న లక్ష్యం పూర్తి చేస్తారు ధైర్యంతో పనులు ప్రారంభిస్తారు. పరిచయం లేని వ్యక్తుల కొరకు ధనం ఖర్చు చేసే వారి చేతిలో మోసపోయే అవకాశం ఉన్నది. దాచాలను కున్నా విషయం బహిర్గతమై ఇబ్బంది కలిగె అవకాశం ఉంది. ఉద్యోగులకు పనిలో ఒత్తిడి బాధ్యతలు పెరిగే అవకాశం ఉంది సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పెద్ద వారి ద్వారా ఆర్థిక సహకారం అందుతుంది నూతన ఉపాధి అవకాశాలు కొరకు ప్రయత్నాలు చేస్తారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

ఈ రాశి వారికి మీ తెలివి తేటలకు గుర్తింపు గౌరవం కలుగుతుంది ఉద్యోగంలో అభివృద్ధి పై అధికారుల నుండి గుర్తింపు పొందుతారు. మనసులో ఉన్న ఆలోచన నిజమయ్యే సూచనలు ఉన్నాయి. చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఒక శుభవార్త వింటారు దూరప్రాంత ప్రయాణం చేయవలసి ఉంటుంది ప్రయాణంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి దానివలన మంచి ప్రయోజనం ఏర్పడుతుంది. కొత్త విషయాలు తెలుసుకుంటారు. వ్యక్తిగత శ్రమ ఎక్కువ ఉంటుంది. ప్రభుత్వ టాక్సులు చెల్లిస్తారు వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు పరిచయం లేని వారిని నమ్మి మోసపోతారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు స్నేహితుల ద్వారా లాభాన్ని పొందుతారు ఒక ముఖ్యమైన శుభకార్యాలలో పాల్గొంటారు



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

ఈ రాశి వారికి మంచి లాభాలతో, చక్కని ఆలోచనా నైపుణ్యములతో ప్రారంభమవుతుంది, చాకచక్యంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. విదేశంలో ఉన్నటువంటి మిత్రుల నుండి శుభ సమాచారం అందుకుంటారు కొన్ని సందర్భాల్లో మీరు అనుకున్నవి అన్నీ మీరు అనుకున్న దానికన్నా,ఎక్కువ ఫలితం పొందే అవకాశం ఉంది. అధికారులతో శత్రుత్వం రాకుండా జాగ్రత్తలు పడాలి. ఆత్మీయులు అనుకున్నవారు మీకు మొఖం చాటు చేసే అవకాశం ఉంది. మీరు చెప్పిన విషయాన్ని మీ మిత్రుడు గాని బంధువులగాని అర్థం చేసుకోలేరు మీయొక్క ఆలోచనలకు, అక్కడ జరిగే పనులకు సంబంధం ఉండక పోవచ్చు అయితే చివరకి మీమాటే నెగ్గుతుంది చాలా వరకు ఈ వారం ఆర్థిక పరంగా అనుకూలంగా ఉంటుంది



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ఈ రాశి వారికి ఈ వారం ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి నిరుద్యోగులకు ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది వివాహ విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు చాలా కాలంగా వాయిదా పడుతున్న ఒక ముఖ్యమైన పని ఈ వారంలో పూర్తవుతుంది . ప్రారంభం గ్రహ మార్పు వల్ల సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. వివాహం కాని వారికి కొంతవరకు వివాహ నిశ్చయ అవకాశం ఉంది వృత్తిలో మార్పు కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి భార్య భర్తలు గాని ప్రేమికుల గాని విహార యాత్రకు పెడతారు ఆనందంగా గడుపుతారు. గృహంలో వాతావరణం నీకు అసంతృప్తి. రాజకీయ రంగంలో వారికి కొంతమేర కష్టం పైన అనుకూలంగా ఉంటుంది



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ఈ రాశి వారికి ఈ వారంప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది దీర్ఘకాలికంగా మీకు వేధిస్తున్నా అనారోగ్య సమస్యల నుండి విముక్తి లభిస్తుంది. ప్రారంభంలో శత్రువులపై విజయం లభిస్తుంది. శత్రువులు మిత్రులు గా మారతారు ఎక్కువగా ప్రయాణాలు చేయవలసి వస్తుంది ఒక ఆధ్యాత్మిక వేత్తను కలుసుకుంటారు వారి నుండి మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది వ్యాపార భాగస్తులు మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉంది.మీ సలహా వలన ఇతరులు కి అసంతృప్తి కి అవకాశం ఉంది ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. స్థిరాస్తి కొనుగోలుకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి మీ కుటుంబంలో ఒకరికి అనారోగ్యం కలిగే అవకాశం ఉంది అదనపు ఆదాయం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి వివాహ వేడుకల్లో పాల్గొంటారు



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ఈ రాశి వారికి ఈ వారం చాలాకాలంగా మీ మనసులో ఉన్న కోరిక నెరవేరుతుంది. సినిమా టీవీ రంగంలో వారికి అనుకూలంగా ఉంటుంది. ప్రయాణంలో నూతన వ్యక్తుల పరిచయం అవుతారు వారి కొరకు మీరు ధనం ఖర్చు పెడతారు సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. వాహనాలు నడిపే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. గృహ వాతావ రణం కొంచెం ఘర్షణ. విద్యార్థులు ఉన్నత విద్య కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి నమ్మక ద్రోహం జరిగే అవకాశం ఉంది బంధువులలో ఒకరి ప్రవర్తన మీ మనసుకు బాధ కలిగిస్తుంది. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది మీ కుటుంబంలో ఒకరికి దూర ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వివాహ విషయం వాయిదాపడిన వివాహ ప్రయత్నాలు తిరిగి పున ప్రారంభిస్తారు. అనుకోకుండా వివాహ విషయమె ఒక నిర్ణయానికి వస్తారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

ఈ రాశి వారు ఈ వారంలోనూతన వస్తువులు సేకరించే ప్రయత్నం చేస్తారు, కుటుంబ విషయాల్లో ఇతరుల జోక్యం అసహనాన్ని కలిగిస్తుంది. తోడబుట్టిన వారికి ఆర్థిక సహాయం అందిస్తారు నిరుద్యోగులకు నూతన ఉపాధి కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. గత కొంత కాలంగా ఆగిపోయిన వృత్తి లేదా వ్యాపారం తిరిగి ప్రారంభించే ప్రయత్నం చేస్తారు. బంధువర్గం నుండి సహాయ సహకారాలు పొందుతారు ఒక శుభకార్యం లేదా సమావేశం కొరకు దగ్గర బంధువులు ఆహ్వానిస్తారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది సరైన నిర్ణయం తీసుకోలేరు ఏ పని మొదలు పెట్టినా ఆటంకములు ఎదురవుతాయి మధ్యలో ఆగిపోయే అవకాశం ఉంది. గత కొంత కాలంగా ఎడబాటుగా ఉన్న భార్య భర్తలు తిరిగి కలుసుకునే అవకాశం ఉంది



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి వారికి ఈ వారం కొత్తగా చేద్దామనుకొని కార్యక్రమాలు వలన ధనం ఖర్చు కలిగే అవకాశం ఉంది నమ్మినవారి చేతిలో ఇబ్బంది కి అవకాశంఉంది. పూర్వం ఇచ్చినధనంతిరిగి రావడం కష్టమవుతుందని తెలుసుకుంటారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తారు గౌరవప్రదమైన వ్యక్తిని నమ్మి ఆశభంగము అవకాశాలు. పదిమందికి ఉపయోగపడే మీ ఆలోచన సంఘంలో పేరు చేస్తుంది ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు వారము మధ్యలో చాలా ప్రోత్సాహకరంగా ప్రారంభమవుతుంది స్నేహితులతో కలిసి ఒక రాజకీయ నాయకులను కలుసుకుంటారు వారి నుండి మీకు కావలసిన పని పూర్తి చేసుకుంటారు. వారి సాయం అనుకున్నట్టు కలుగుతుంది



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

ఈ రాశి వారికి ఈ వారం అనుకోకుండా దగ్గర బంధువులు సహాయ సహకారాలు అందిస్తారు వృత్తిరీత్యా దూరప్రాంత ప్రయాణం చేయవలసి వస్తుంది ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించండి. అజీర్ణ సమస్యలు బాడీ పెయిన్స్ కీళ్ల నొప్పులు కలిగే అవకాశం ఉంది కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి ఆర్థికపరంగా మీరు నష్టపోయిన ధనంలో కొంత లభిస్తుంది చాలా కాలంగా మీరు పడుతున్న కష్టనష్టములు నుండి కొంత ఊరట లభిస్తుంది . దైవ బలంతో ఎదురవుతున్న వాటిని జయించండి. స్థిరాస్తులు అమ్మే ప్రయత్నం చేస్తారు అయితే వాటికి సరైన ధర రాక మీ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటారు మీరు చెల్లించవలసిన పనులు సకాలంలో చెల్లించకపోవడంతో అధికారుల నుండి ఒత్తిడి కలుగుతుంది



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

ఈ రాశి వారు ఈ వారంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు ఆశ్రమాలు సందర్శిస్తారు. దూర ప్రాంతంలో ఉపాధి కొరకు ప్రయత్నం చేస్తారు ఎలక్ట్రానిక్ వస్తువులు అధిక ఖర్చుతో కొనుగోలు చేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్యులు సంప్రదిస్తారు పిల్లల విద్య కొరకు ఎక్కువ ధనం ఖర్చు చేయవలసి ఉంటుంది వ్యక్తిగత ఆకర్షణ గౌరవం పెరుగుతాయి స్థిరాస్తుల పై ఆదాయం పెరుగుతుంది. అధికా రు లను కలుసుకుంటారు భార్య లేదా భర్తకు వృత్తిలో అభివృద్ధి కొరకు ప్రయత్నం చేస్తారు. గతంలో మీ నుండి దూరమైన మిత్రుడు తిరిగి కలుసుకుంటారు కుటుంబంలో శుభకార్యాలు గురించి చర్చిస్తారు కుటుంబ ఆదాయం పెరుగుతుంది నిలకడగా వచ్చే ఆదాయం లో ఆటంకం కలుగుతుంది వాహనాలు రిపేర్ చేస్తారు.


పూజా హెగ్డే